# అందని ద్రాక్ష "చూపులు"

ముదురాకు రాలేటి ముదిమినాళులలోన తొడిగేటి చివురాకు పడుచు పొద్దులలోన ఆకునైన కానుగా—

అయినచో
సోకేది చిరుగాలి నన్ను
మెల్లతాకేది మిణిగురుల హొన్ను

మొగిలు కన్నెల గుంపు ధగధగ మని మెరిసేటి చిగురు వెన్నెల కావి సొనిసు సంజెలలోన మొగిలునైనా కానుగా—

అయినచో
ఎగిరిఉందును మింట కొనల

మెల్ల తగిలి యుందును వెల్గు సొనల తొలి ప్రేమ రుచిచూచు నెల ప్రాయపుంగన్నె తలిరు మెత్తని నీలవలపులో ఊహనైనా కానుకగా

అయినచో
వలచేది నను చిన్న చూపు
మెల్లకలచేది చివురాకు తూపు

ఇది సుమారు 60 ఏళ్ల క్రితం 1926 లో విశ్వనాథ వ్రాసిన చిన్న తలపు అనే గేయం మెత్తమెత్తని మాటలతో పరమ సుకుమారమైన భావనలతో గేయాలు అల్లారు విశ్వనాథ కిన్నెరసాని పాటలు కోకిలమ్మ పెళ్ళి ఆ కోవలోనివే. ఎన్నో ఖండికలున్నాయి. ఎన్నో ముక్తకాలున్నాయి. పంచవింశతి అనే సంకలనంలో విశ్వనాథ వారి చమత్కారం కవితా ధోరణి ఎంత గొప్పగా ఉంటాయో చూడొచ్చు.

యామినీ సరస్వతి

ఆకాశంలో తెల్లమబ్బు అనే గేయం 1925 లో సాహితిలో అచ్చయింది.

నీవు నేను కూడి
నింగి లోనికి పోయి
నీలిమబ్బుల తేలి
చందమామను చూసి చానా ! నవ్వామె
చందమామా నవ్వె చానా నను చూచి
చందమామా నవ్వె చానా నిను చూచి
తిరిగి రాబోయామె
తెరవ నీవంతలో
తెల్ల మబ్బయ్యావే
చల్లనైనా వొలు చానా ! నవ్వానె (చందమామా)
అంతలోనే చూడ ఆకాశమైనావే
ఆకాశమున వ బ్బువై నీవు తేలుచూ
చందమామను చూచి చానా నవ్వామే

ఇలాంటి గేయాలే కాదు మెత్తని పద్యాలు రాశారు.

కల్ప వృక్షంలో అరణ్య కాండలో - సీతను ఎత్తు కెడుతూ రావణు ఉంటాడు

ఐపాన వాలు తెలియని
నా పోయిన తెన్ను తెలియునా తనికిన్
వాపోయిన వాపోతలు
ఏ పుట్టం పుట్టిబోవు నితని కథాపల్

ఐపు ఆనవాలు తెలియికుండా పోతున్న నాదారి అతనికి తెలుస్తుందా ! నీవు తప్పి పోయావని అతను వాపోయె వాపోతాలు - ఏడ్పులు - ఏ పుట్టలో కథలుగా పుడతాయో ! అంటాడు. ఎంత గొప్ప చమత్కారం ఉందో మనసుకే తెలుస్తుంది.

ఆయనకి మనమన్నా, మన భాషన్నా, మన సంస్కృతి అన్నా పట్టా పగ్గాలు లేని భావావేశం పుట్టుకొస్తుంది. ఆంధ్రత్వ మాంధ్ర భాషాచ అన్న అప్పయ్య దీక్షితులలాగే -

బహుజన్మ కృత పుణ్య పరిపాకమున జేసి
ఆంధ్రుడై ధాత్రిలో నవతరించు
బహుజన్మ కృతపుణ్య పరిపాకమున జేసి
ఆంధ్రభాషను మాటలాడు చుండు
బహుజన్మ కృతపుణ్య పరిపాకమున జేసి
ఆంధ్రత్వమన నిద్దియని యెరుంగు
బహు జన్మ కృత పుణ్య పరిపాకమున జేసి
ఆంధ్రీ మహామూర్తి నైక్యమొందు

వట్టి నడమంతరపు సిరి వట్టినట్టి
బాసలంగని మతి భ్రాంతి పడకు మోయి
ఆంధ్రుడని నంత నాత్మ తత్త్వ
మఖిలము నెరుంగుటన్నది యంచు తెలియు

అంత రసావేశం గానే చెప్పిన ఆంధ్ర పౌరుషం చదివేందుకు కాస్తంత తీరిక, అర్థం చేసుకొనే ఓపిక ఉంటే క్రమ క్రమంగా కిన్నెరసాని పాటలతో శశి దూతం ప్రారంభించి కల్ప వృక్షం దాకా సాగిపోవచ్చు.

అమృతం గూడుగట్టిన దొరలాంటి మధుర కవిత్వమును ఆస్వాదించ వచ్చును. కావ్యరూపమైన విశ్వనాథ శారదనే కాక నవలా రూపంగా అంతరాత్మ అయి ఏకవీరగా రూపుదిద్దుకొని చెలియలి కట్టను దాటుకొని వేయి పడగలుగా విస్తరిల్లిన విష్ణు శర్మ ఇంగ్లీషు చదువు పురాణ వైర గ్రంథాలు దాకా ఎలా మ్రోయు తుమ్మెదగా ప్రతిధ్వనించిందో చూడవచ్చు. స్వర్గానికి నిచ్చెనలు వేయ వచ్చు కానీ - లోకంలో అందని ద్రాక్ష పళ్ళు పుల్లన అని ఓ సామెత ఉంది. మనకు అందుబాటులో లేనిది అందుకోడానికి మన శక్తి చాలక అది ఒప్పుకోవడం ఇష్టంలేక ఆ వస్తువునే కించపరచడం బతక నేర్చిన వాళ్ళ రీతి. ఆ ధోరణిని చూపేది ఈ సామెత.

కవిత్వం ఆస్వాదించడానికి పాండిత్యం కంటే ముఖ్యమైంది రసవంత మయిన మనస్సు. అది లేక పోవడం వలన జీవివంతమయిన కవిత్వం అదృశ్య

మాతూనే ఉంది. ప్రభుత్వం అంతరించి పోయే అరుదైన జంతు జాలాన్ని పక్షి సంతతిని జాతికోసం అంటూ జూలో ఉంచి కాపాడుతుంది. కాని జాతి చైతన్యానికి మూల భూతమైన కవిత్వ తత్వాన్ని రక్షించే కవుల్ని పండితుల్ని వారి రచనల్ని గురించి పట్టించు కోడం లేదు.

విశ్వనాధ సత్యనారాయణగారు ఒకచోట అంటారు

తొలి నాళల పద్యార్థము
తెలియనిచో పాఠకునిది తెలియమి ఈనా
ళుల వ్రాసిన కవి దోషము
కలి ముదిరిన కొలది చిత్రగతులన్ నడుచున్

అలా ఐపోయింది పరిస్థితి. విశ్వనాధ వారిది పరమ సుకుమారమైన శైలి. ఆయన్ని చదవ లేక పాషాణ పాకం అనడంపైన చెప్పిన లాటిదే.

—o—